●న్యాయం చేస్తాం



రైతులు సాగు చేసుకుంటున్న ప్రభుత్వ భూములను సంబంధించి న్యాయం చేస్తామని నర్సరావుపేట ఆర్డీఓ ఎం.శేషి రెడ్డి అన్నారు. మండలంలోని అయ్యన్నపాలెం రెవెన్యూలో వీరప్పకుంట తండాకు చెందిన అన్‌సర్వే భూములను గురువారం సాయంత్రం సందర్శించారు. ఆయా గ్రామాల్లో భూములను పరిశీలించి రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ భూమి లేని నిరుపేద రైతులు సాగు చేసుకుంటున్న ప్రభుత్వ భూమిని ఆయా రైతులకు చేందే విధంగా న్యాయం జరుగుతుందని తెలిపారు. అసైన్ మెంట్ కమిటీ ద్వారా అసైన్డు భూములను పట్టాలు అందజేస్తామని చెప్పారు. అనంతరం అధికారులతో సమావేశమయ్యారు.

-బొల్లాపల్లి

●జగన్మాతా... పాహిమాం..



మండలంలోని బోయ పాలెం పార్వతీదేవి ఆలయంలో గుంటూరు-ఎన్టీఆర్ కృష్ణా జిల్లాల రీజినల్ కో-ఆర్డినేటర్ మర్రి రాజశేఖర్ గురువారం పార్టీ శ్రేణులతో పూజలు నిర్వహించారు. గత నెల 20వ తేదీన ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ఎమ్మెల్యే కోటలో ఎమ్మెల్సీ ప్రకటించిన అనంతరం అదే రోజున అమ్మవారి ఆలయంలో పూజలు నిర్వహించారు. తిరిగి అమ్మవారి సన్నిధిలో పూజలు చేసి నామినేషన్ కార్యక్రమానికి బయలుదేరి వెళ్లారు.

-యడ్లపాడు

●రీసర్వే వేగవంతం చేయండి



మండలంలో నిర్వహిస్తున్న రీసర్వే పనులను వేగవంతం చేయాలని జాయింట్ కలెక్టర్ శ్యాంప్రసాద్ అన్నారు. గురువారం తహసీల్దార్ కార్యాలయంలో రీసర్వేపై నిర్వహించిన సమీక్షలో ఆయన పాల్గొని మాట్లాడారు. రీసర్వే జరుగుతున్న గ్రామాల్లో ప్రస్తుత సర్వే పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. సర్వే నిర్వహణలో సర్వేయర్‌లు అవలంభించవలసిన పద్ధతులపై ఆయన పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ అంకారావు, మొబైల్ మెజిస్ట్రేట్ బాల వెంకటేష్, మండల సర్వేయర్ భాగ్యలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

- రొంపిచర్ల

●ఆలయ జీర్ణోద్ధరణ



కోటసెంటర్ పులుపులవారి వీధిలోని శ్రీవీరాంజనేయ సహిత శ్రీయోగానంద లక్ష్మీనరసింహస్వామి ఆలయ జీర్ణోద్ధరణ పనులు గురువారం ప్రారంభమయ్యాయి. దాదాపు శతాబ్ద కాలం నాటి ఆలయం కావటంతో ఆలయ జీర్ణోద్ధారణ కమిటీ ఆధ్వర్యంలో పనులు చేపట్టారు. దీనిలో భాగంగా ఉదయం ఆలయంలోని మూలమూర్తులకు ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. స్వామివార్ల బాలాలయం నిర్మాణం చేపట్టారు. ఆగమ పండితుడు వేదాన్తం రంగనాథస్వామి అయ్యంగార్ ఆధ్వర్యంలో ఆలయ అర్చకుడు నారాయణం తాండవ కృష్ణమాచార్యులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

- నరసరావుపేట ఈస్ట్

క్లుప్తంగా

యడ్లపాడు ఇన్‌చార్జి ఎంఈవోగా ఆంజనేయులు

యడ్లపాడు: మండల విద్యాశాఖ అధికారిగా ఐ ఆంజనేయులు గురువారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పనిచేసిన అబ్బరాజు శ్రీనివాసరావు బదిలీపై వెళ్లగా ఆయన స్థానంలో నాదెండ్ల మండలం ఎంఈవోగా పనిచేస్తున్న ఆంజనేయులను ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించినట్లు తెలిపారు.

సాఫ్ట్‌బాల్ పోటీలకు ముప్పాళ్ల విద్యార్థి



ఈపూరు: ఆలిండియా సాఫ్ట్ బాల్ పోటీలకు మండలంలోని ముప్పాళ్ల ధనలక్ష్మి వ్యాయామ కళాశాలకు చెందిన ఎంపీఈడీ ద్వితీయ సంవత్సరం విద్యార్థి దాచేపల్లి అయ్యప్ప ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చుండు వెంకట్రావు గురువారం తెలిపారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ క్రీడాప్రాంగణంలో ధనలక్ష్మి వ్యాయామ కళాశాల ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్ కళాశాలల సాఫ్ట్ బాల్ పోటీల్లో పాల్గొని ఆలిండియా అంతర్ విశ్వవిద్యాలయాల పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. ఏప్రిల్ మాసంలో చండీగడ్‌లో జరిగే ఈ పోటీల్లో ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్నట్లు ఆయన వివరించారు. ఎంపికైన విద్యార్థి అయ్యప్పను కళాశాల ప్రిన్సిపాల్ వెంకట్రావుతో పాటు చైర్మన్ మేదరమెట్ల రామశేషగిరిరావు, అధ్యాపకులు వై.సురేష్, ఆర్‌బీ నాయక్, ఎం.సురేష్, ఎం.దాస్‌లు అభినందించారు.

మహిళా చట్టాలపై అవగాహన

నరసరావుపేట ఈస్ట్: మహిళా దినోత్సవ వారోత్సవాలను పురస్కరించుకొని గురువారం బరంపేటలోని మున్సిపల్ పాఠశాలలో మండప న్యాయ సేవాధికారసంస్థ ఆధ్వర్యంలో మహిళా చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ప్యానల్ న్యాయవాదులు ఎస్.ప్రసాదు, వి.శరత్‌బాబు, జి.ఎం.బ్లెసీనా పాల్గొని మహిళల హక్కులు, ఉచిత న్యాయసహాయం, భరణం, భ్రూణ హత్యల నివారణ, గృహహింస తదితర అంశాలపై అవగాహన కలిగించారు. కార్యక్రమంలో పారా లీగల్ వాలంటీర్ ఎం.కాంచన, డ్వాక్రా కోఆర్డినేటర్లు ఎస్.నాగవేణి, జి.లక్ష్మీకుమారి, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

అభినందనీయం...



చిలకలూరిపేట: నిరుపేదలకు ఆసరాగా నిలవడం అభినందనీయమని పట్టణ ఎస్‌ఐలు ఎం మోహన్, లోకేష్‌లు చెప్పారు. పట్టణంలోని పురుషోత్తమపట్నం బైపాస్‌లో నివాసం ఉండే నిరుపేదలకు వైఎంసీఏ ఆధ్వర్యంలో స్టీల్ కంచాలు, గ్లాసులు గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిరుపేదల అవసరాలు గుర్తించి వైఎంసీఏ సభ్యులు ఎప్పుడూ వితరణ కార్యక్రమాలు నిర్వహించటం పట్ల కొనియాడారు. కార్యక్రమంలో వైఎంసీఏ అధ్యక్ష, కార్యదర్శులు కె రామమోహన్‌రావు, పులిపాటి కెనడి, చుక్కా విన్సెంట్‌పాల్, అలంగార్ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

పన్ను వసూళ్లను పూర్తి చేయాలి

వినుకొండ(నూజెండ్ల) : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమీక్షా సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో జిలానీబాషా మాట్లాడుతూ మండలంలో అన్ని గ్రామ పంచాయతీల్లో నూరుశాతం ఇంటి పన్ను వసూళ్లు చేయాలన్నారు. జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణం సత్వరమే పూర్తి చేయాలని, ఇప్పటికే పూర్తయిన కాలనీల్లో మౌలిక వసతులు ఏర్పాటు చేయాలని సూచించారు. ఆయుష్మాన్ భారత్ సర్వే త్వరగా చేయాలని అన్నారు. కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ రవి కుమార్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

సమన్వయంతోనే సమగ్ర అభివృద్ధి

● ఎంపీపీ పిడతల ర్యూన్నీ
● మండల సమావేశానికి డుమ్మా కొడితే నోటీసులు తప్పవు



సమావేశంలో ఎంపీపీ పిడతల ర్యూన్నీ, ఎంపీడీవో వై.హనుమా రెడ్డి

యడ్లపాడు: అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతోనే ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు చేరువవుతాయని ఎంపీపీ పిడతల ర్యూన్నీ చెప్పారు. యడ్లపాడు మండల ప్రజా పరిషత్ సర్వసభ్య ఏడో సాధారణ సమావేశం ఎంపీపీ అధ్యక్షత వహించి మాట్లాడారు. అధికారులు బాధ్యతగా వ్యవహరిస్తూ ప్రజాప్రతినిధుల్ని గౌరవించే విధంగా తగు సమాచారం వారికి అందించాలన్నారు. సమావేశానికి డుమ్మా కొట్టే అధికారులకు ఇకపై నోటీసులు ఇస్తామని ఎంపీపీ హెచ్చరించారు. గౌరవ సభ్యులు కూడా ప్రభుత్వ పథకాలను ప్రగతి విషయాలను సమగ్రంగా తెలుసుకుని గ్రామస్తులకు తెలపాల్సిన బాధ్యత వారిపై ఉందన్నారు.

అధికారులు తెలిపిన ప్రధాన అంశాలు..

రైతులు పంటలకు మందులు పిచికారీ చేసుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం రాయితీపై డ్రోన్ యంత్రాల్ని ఇస్తుందని ఏవో సరిత చెప్పారు. ఇకపై పాఠశాలల్లో ఒకటో తరగతి ప్రవేశాలకు పిల్లవాడి వయస్సు ఆరేళ్లు నిండాలని ఎంఈవో ఐ ఆంజనేయులు తెలిపారు. స్టడీ అవర్స్‌కు హాజరయ్యే పది విద్యార్థులకు అల్పాహారం నిధులు వచ్చాయన్నారు. గతేడాది పది ఉత్తీర్ణత శాతం బాగా తగ్గిన విషయంపై ఎంపీపీ ఎంఈవోను ప్రశ్నించారు. పిల్లలు, టీచర్ల తప్పిదమని, హైస్కూల్ టీచర్లతో సమీక్షించి ఈ ఏడాది మెరుగైన ఫలితాలకు కృషి చేస్తామన్నారు. పీహెచ్‌సీలో నాడు-నేడు పనుల్ని మందకొడిగా ఆర్‌అండ్‌బీ అధికారులు చేయడంతో తాగునీటి కోసం రోగులు ఇబ్బందులు పడాల్సి వస్తుందని పీహెచ్‌సీ వైద్యాధికారి ఆర్.గోపీనాయక్ ఆరోపించారు. జలజీవన్ మిషన్‌కింద మండలంలోని 17 గ్రామాల్లో ఇంటింటికీ కుళాయికి ప్రణాళిక పూర్తయి టెండర్ దశలో ఉందని ఓకే కాగానే ఆయా పనుల్ని ప్రారంభిస్తామని ఆర్‌డబ్ల్యూ ఏఈ శ్రీనివాసరావు వెల్లడించారు. మనబడి నాడు-నేడు రెండోదశ పనులు మండలంలో 24 స్కూళ్లలో చురుగ్గా కొనసాగుతున్నాయని పీఆర్ ఏఈ శ్రీనివాస్ తెలిపారు. పోషకాహారం తక్కువగా ఉన్న చిన్నారులపై ప్రత్యేక దృష్టిని సారించి వారి కుటుంబ సభ్యుల్లో అవగాహన కల్పిస్తున్నట్లు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వాణి చెప్పారు. ఆయకట్టు భూములతో పాటు తాగునీటి చెరువులకు సాగర్ జలాలను పెట్టుకోవాలని ఏఈ సుభాషిణి తెలిపారు. మహిళాభివృద్ధికి బ్యాంకు లింకేజీతో పాటు ఉన్నతి, శ్రీనిధి ద్వారా ప్రభుత్వం రుణాలు అధికంగా ఇస్తుందని, వాటిని లబ్ధిదారులు సదరు యూనిట్‌ను స్థాపించి లక్ష్యం కోసమే వినియోగించుకోవాలని ఏపీఎం జీవన్ పేర్కొన్నారు. సమావేశంలో ఎంపీడీవో వై హనుమారెడ్డి ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, వివిధ శాఖల అధికారులు హాజరయ్యారు.

సీఆర్ కళాశాల వశమైన రోలింగ్ ట్రోఫీ

● అంతర్ కళాశాల పోటీల్లో సత్తాచాటిన క్రీడాకారులు
● యూనివర్సిటీ తరపున జాతీయస్థాయి టోర్నమెంట్‌కు ఐదుగురు ఎంపిక



సాఫ్ట్‌బాల్ క్రీడాకారులతో కళాశాల సెక్రటరీ చుండి వేణుగోపాల్

నాదెండ్ల: అంతర్ కళాశాలల సాఫ్ట్‌బాల్ పోటీల్లో ఎనిమిదోసారి ప్రథమస్థానాన్ని కైవసం చేసుకుని రోలింగ్ ట్రోఫీని సీఆర్ కళాశాల జట్టు అందుకుంది. ఈ నెల 7,8 తేదీల్లో ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో అంతర్ కళాశాల సాఫ్ట్‌బాల్ పోటీలు జరిగాయి. సీఆర్ కళాశాల జట్టు ఉత్తమ ప్రతిభ చూపి వరుసగా ఎనిమిదిసారి ప్రథమస్థానం సాధించి రికార్డు నెలకొల్పారు. ఎంఏఎం ఫార్మసీ కళాశాల చైర్మన్ ఎంఆర్ శేషగిరిరావు తల్లిదండ్రుల జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన శ్రీమతి మేదరమెట్ల అంజమ్మ మస్తాన్‌రావు మెమోరియల్ రోలింగ్ ట్రోఫీని మొదటిసారిగా కళాశాల జట్టు కైవసం చేసుకున్నారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ చుండి వేణుగోపాల్, ప్రిన్సిపల్ ఎం.శ్రీనివాసరావు, వైస్ ప్రిన్సిపల్ సీహెచ్ చైతన్య, పీడీ నాగేంద్రబాబు, లైబ్రేరియన్ నిరంజన్ తదితరులు అభినందించారు.

యూనివర్సిటీ జట్టుకు ఐదుగురు ఎంపిక

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం యూనివర్సిటీ సాఫ్ట్‌బాల్ జట్టుకు సీఆర్ కళాశాల విద్యార్థులైన బి.సతీష్, ఎం.ప్రేమ్‌కుమార్, కె.కుమారబాబు, షేక్ హయం, ఎం సాగర్ బాబులు ఎంపికయ్యారు. వీరు ఏప్రియల్ మొదటి వారంలో చండీగఢ్‌లోని పంజాబ్ యూనివర్సిటీలో జరిగే ఆలిండియా ఇంటర్ యూనివర్సిటీ టోర్నమెంట్‌లో ఏఎన్‌యూ తరపున ప్రాతినిధ్యం వహించనున్నారు.

ఇస్సప్పాలెంలో తిరునాళ్లు ఆరంభం



పట్టువస్త్రాలు తీసుకువస్తున్న ఎమ్మెల్యే గోపిరెడ్డి

నరసరావుపేట రూరల్: ఇస్సప్పాలెంలో వేంచేసియున్న మహంకాళి అమ్మవారి 48వ తిరునాళ్ల మహోత్సవాలు గురువారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉదయం ఆలయ ప్రవేశం, విఘ్నేశ్వరపూజ, పుణ్యాహవాచనం, పంచగవ్య ఆరాధన, దీక్షాధారణ, అఖండ దీపారాధన, ఆస్త్రరాజార్చన, అమ్మవారికి స్నపనము, చండీపారాయణం నిర్వహించారు. ఆంధ్రరాష్ట్రీయ ఆదిశైవ సంఘ అధ్యక్షుడు యనమండ్ర సత్యసీతారామశర్మ, అర్చక స్వాములు కొత్తలంక కార్తికేయ శర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి పూజాధికాలు నిర్వహించారు. ప్రత్యేక అలంకరణలు నిర్వహించిన అనంతరం అమ్మవారిని భక్తులు దర్శించుకున్నారు. సాయంత్రం అంకురారోపణ, ధ్వజారోహణ, అగ్నిప్రతిష్టాపన, మూలమంత్ర హోమాలు నిర్వ హించారు. భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. భక్తు లకు ఉచిత ప్రసాదం, తాగునీరు అందజేశారు. ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించారు. అనంతరం నిర్వహించిన నగరోత్సవంలో పాల్గొన్నారు. ఆలయ ఈవో టి.సుధాకరరెడ్డి, ధర్మకర్తల మండలి మాజీ చైర్మన్ జల్లి శ్రీనివాసరావు, సభ్యులు ఏలూరి అశోక్‌బాబు, వంకా శ్రీనివాసరెడ్డి, మునగా శ్రీనివాసరావు, మాలపాటి తిరుపతిరెడ్డిలు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

మంచినీటి సరఫరా పునరుద్ధరణకు చర్యలు



పనులను పరిశీలిస్తున్న షేక్ రఫాని

చిలకలూరిపేట: మంచినీటి సరఫరా పునరుద్ధరణకు యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టాలని మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని సూచించారు. బైపాస్ రోడ్డు నిర్మాణ పనుల్లో భాగంగా పట్టణానికి మంచినీరు సరఫరా చేసే ప్రధాన పైప్‌లైన్ ఇంటర్ కనెక్షన్ పనులను గురువారం ప్రారంభించారు. ఈ నేపథ్యంలో పట్టణ పరిధిలో నీటి సరఫరా నిలిచిన క్రమంలో పైప్‌లైన్ ఇంటర్ కనెక్షన్ పనులను అధికారులతో కలసి మున్సిపల్ చైర్మన్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శుక్రవారం మధ్యాహ్నానికి పనులు పూర్తి చేసి నీటి సరఫరా పునరుద్ధరించాలని చెప్పారు. వేసవి కాలం నీటి సరఫరా ఆవశ్యకతను గుర్తించి పనులు వేగవంతంగా నిర్వహించాలన్నారు. అవసరమైతే అదనపు సిబ్బందిని నియమించి పనులు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సీహెచ్ గోవిందరావు, డీఈఈ తోట వెంకటరమణ, ఏఈఈ చల్లా శ్రీనివాసరావు, పబ్లిక్ హెల్త్ డీఈఈ శ్రీనివాసరావు, సుబ్బారామిరెడ్డి, కృష్ణారావు, నాగబ్రహ్మాచారి పాల్గొన్నారు.

బీసీ కుల గణన చేపట్టాలి

రొంపిచర్ల: కేంద్ర ప్రభుత్వం బీసీ కుల గణన చేపట్టాలని భారతీయ బహుజన పార్టీ అధ్యక్షుడు సంపతి వెంకట్ యాదవ్ అన్నారు. బహుజనులకు సామాజిక న్యాయం కోసం భారతీయ బహుజన పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు సంపతి వెంకట్ యాదవ్ చేపట్టిన బహుజన పార్టీ పాదయాత్ర గురువారం మండల కేంద్రమైన రొంపిచర్లకు చేరుకుంది. స్థానిక చెరువుకట్ట సెంటర్‌కు చేరుకున్న వెంకట్ యాదవ్ పాదయాత్రకు బీసీ సంక్షేమ సంఘం మండల నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం నియోజక వర్గ ఉపాధ్యక్షుడు సరికొండ తిమ్మరాజు, మండల నాయకులు ముక్కడాల వెంకటేశ్వరరావు, ఉప్పలపాటి వెంకటేశ్వర్లు, తమ్మిశెట్టి గురువులు, జమ్ముల మడుగు లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు ట్రైబల్ పాఠశాలకు శంకుస్థాపన

వినుకొండ(నూజెండ్ల): పట్టణంలోని విఠంరాజుపల్లి, కారంపూడి బైపాస్ రోడ్డులో ట్రైబల్ వెల్ఫేర్ పాఠశాల, వసతి గృహాలనిర్మాణానికి శుక్రవారం శంకుస్థాన కార్యక్రమం నిర్వహిస్తున్న నేపథ్యంలో ఎమ్మెల్యే బొల్లాబ్రహ్మనాయుడు, స్థానిక అధికారులతో కలసి స్థలాన్ని పరిశీలించారు. మున్సిపల్ కమిషనరు బి.శ్రీనివాసులు, తహసీల్దార్ కిరణ్‌కుమార్, లతోలసి పాఠశాల స్థలాన్ని పరిశీలించారు. ఆయన వెంట పలువురు అధికారులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో వ్యక్తి ఆత్మహత్య

చిలకలూరిపేటటౌన్: అనారోగ్యంతో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన గురువారం వెలుగు చూసింది. రూరల్ పోలీసుల కథనం ప్రకారం బాపట్ల జిల్లా యద్దనపూడి మండలం వింజనంపాడు గ్రామానికి చెందిన ఆలూరి ఆశీర్వాదం(42) పెయింటింగ్ పనులు చేస్తుంటాడు. చిన్నతనం నుంచి ఫిట్స్ సమస్యతో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో ఈ నెల ఏడోతేదీ మండలంలోని పసుమర్రు వైన్‌షాపులో మద్యం కొనుగోలు చేసి దానిలో గడ్డిమందు కలుపుకొని సేవించి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన స్థానికులు ఆశీర్వాదం తండ్రికి సమాచారం అందించారు. చికిత్స నిమిత్తం చిలకలూరిపేట ప్రభుత్వాసుపత్రికి అనంతరం మెరుగైన చికిత్స కోసం గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందాడు. మృతుడి తల్లి మున్నెమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య, ఇరువురు సంతానం ఉన్నారు.

చోరీ కేసులో ఆరు నెలల జైలు

నరసరావుపేట టౌన్: పలు చోరీ కేసుల్లో నిందితుడిపై నేరం రుజువు కావటంతో ఆరు నెలల జైలు శిక్ష, రూ.1000 రూపాయల జరిమాన విధిస్తూ మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి ప్రవల్లిక గురువారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. లింగంగుంట్ల గ్రామానికి చెందిన దాసరి విజయ్ నరసరావుపేట రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో గత ఏడాది ఆరు ప్రాంతాల్లో చోరీలకు పాల్పడ్డాడు. ఈ మేరకు బాధితులు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన రూరల్ పోలీసులు విజయ్‌ను అరెస్ట్ చేసి అతని వద్ద నుంచి చోరీకి గురైన సొత్తును స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని కోర్టులో హాజరు పరిచి అభియోగ పత్రం దాఖలు చేశారు. నేరం రుజువు కావటంతో ఒక్కొక్క కేసులో ఆరు నెలల జైలు శిక్ష విధిస్తూ శిక్షను ఏకకాలంలో అనుభవించేలా న్యాయమూర్తి తీర్పు చెప్పారు.

పూరిపాక దగ్ధం

నాదెండ్ల: గ్యాస్ సిలిండర్ పేలి పూరిపాక దగ్ధమైన సంఘటన మండలంలోని నాదెండ్ల బీసీ కాలనీలో గురువారం చోటు చేసుకుంది. అగ్నిమాపక దళ సిబ్బంది తెలిపిన వివరాల మేరకు నాదెండ్ల బీసీ కాలనీ సచివాలయం-2 సమీపంలో పోతూరి రామయ్యకు చెందిన పూరిపాక మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో గ్యాస్ సిలిండర్ లీకై మంటలు వ్యాపించాయి. దీంతో సిలిండర్ పేలిపోవటంతో గుడిసె పూర్తిగా దగ్ధమైంది. ఈ ప్రమాదంలో గుడిసెలో ఉన్న వస్తువులు, దుస్తులన్నీ కాలి బూడిదయ్యాయి. అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపులోకి తెచ్చారు.

అన్నదాన కార్యక్రమం విశేషమైంది

వినుకొండ టౌన్: అన్ని దానాలలో కెల్ల అన్నదానం గొప్పదని, అందులో అందరిని భాగస్వాములను చేయడం అభినందనీయమని ముఖ్యఅతిథులు వాసవీ క్లబ్ గవర్నర్ విజయలక్ష్మి, విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షులు భాగవతుల రవికుమార్‌లు పేర్కొన్నారు. శ్రీ వాసవీ అన్నదాన సేవా సంస్థ వినుకొండ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం పట్టణంలోని శ్రీ రంగనాయక స్వామివారి దేవస్థానం వద్ద గురువారం నిర్వహించారు. కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు పెండేల సురేష్ బాబు, వ్యవస్థాపక చైర్మన్ గజవల్లి నాగ పవన్ కుమార్, అధ్యక్షులు చిలంకూరి వెంకట కోటేశ్వరరావుతో పాటు కార్యవర్గ సభ్యులు, సభ్యులు పాల్గొన్నారు.

ఐరన్, కాల్షియం ట్యాబ్‌లెట్లు అందజేత

శావాల్యాపురం (నూజెండ్ల): జిల్లా వైద్యాధికారుల సూచనలమేరకు మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలలో విద్యార్థులకు, ఐరన్, కాల్షియం ట్యాబ్‌లెట్లు పంపిణీ చేసినట్లు వైద్యాధికారి డాక్టర్ సయ్యద్ ఇబ్రహీం తెలిపారు. రాష్ట్రీయ బాలస్వాస్థ్య కార్యక్రమంలో భాగంగా ఐరన్ ట్యాబ్‌లెట్లతో పాటు, ఫ్లోరోసిస్ నివారణకు క్యాల్షియం ట్యాబ్‌లెట్లు కూడా పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు.

ఉగాదికి జగనన్న ఇళ్ల గృహప్రవేశాలు



అప్పాపురం గ్రామంలో ఇంటి నిర్మాణాన్ని పరిశీలిస్తున్న డీఎల్‌డీవో వెంకటరెడ్డి

వినుకొండ(నూజెండ్ల): ఉగాది పండుగకు శ్లాబ్‌లు వేసిన ఇళ్లన్నీ గృహప్రవేశాలకు సిద్ధం చేయాలని డీఎల్‌డీవో ఎం.వెంకటరెడ్డి అన్నారు. మండలంలోని వి.అప్పాపురం ఎస్సీ కాలనీలో జగనన్న ఇళ్ల నిర్మాణాన్ని గురువారం ఆయన పరిశీలించి పలు సూచనలు చేశారు. మండలంలోని జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. అనంతరం నూజెండ్ల గ్రామసచివాలయాన్ని సందర్శించి రికార్డులను తనిఖీ చేశారు. సచివాలయ ఉద్యోగులు ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. ప్రభుత్వ పథకాలను ప్రజలకు సక్రమంగా అందజేయడంలో అలసత్వం వహించరాదన్నారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ బి.నరేంద్ర, ఇంజినీరింగ్ అసిస్టెంట్ బలరాం తదితరులు ఉన్నారు.

రబీ పంటలు పరిశీలించిన శాస్త్రవేత్తల బృందం

మొక్కజొన్నలో ఆకుముడత నివారణకు సూచనలు



మినుము పంట పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు, వ్యవసాయాధికారుల బృందం

నాదెండ్ల: మండలంలోని సాతులూరు గ్రామంలో రబీలో సాగవుతున్న పంటలను గురువారం జిల్లా వనరుల కేంద్రం ఆధ్వర్యంలో అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ కిషోర్‌బాబు, శాస్త్రవేత్తల బృందం మొక్కజొన్న, మినుము, కంది పంటపొలాలను సందర్శించారు. పెద్దాపురం వ్యవసాయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ భరత్‌చంద్ర మొక్కజొన్న పంటను పరిశీలించి రైతులకు పలు సూచనలు ఇచ్చారు. మొక్కజొన్నలో టర్సికమ్ ఆకుముడతను గుర్తించి దీని నివారణకు మాంకోజిత్ ఎకరాకు 400 గ్రాముల చొప్పున లేదా అమిస్టార్ టాప్ 200 మిల్లీగ్రాములు ఎకరాకు పిచికారీ చేయాలని సూచించారు. మొక్కజొన్నలో అక్కడక్కడ కాడకుళ్ళు తెగులు గుర్తించారు. మినుములో పీయూ31 రకాన్ని పరిశీలించిరాబోవు కాలంలో మేలురకమైన ఎల్‌బీజీ 930 రకాన్ని సాగు చేసుకోవాలని సూచించారు. ఈ రకం అధిక దిగుబడులు సాధించుకోవచ్చన్నారు.

చట్టాలపై అవగాహన ఏర్పరుచుకోవాలి



సదస్సులో పాల్గొని మాట్లాడుతున్న చెన్నకేశరెడ్డి

శావల్యాపురం: మహిళలు చట్టాలపై అవగాహన కల్గియుండాలని మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్ కర్నాటి చెన్న కేశవరెడ్డి (సీకె) అన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆదేశాల మేరకు మండల స్థాయిలో గ్రామ సచివాలయ మహిళా పోలీసులకు నిర్వహించారు. ఈసందర్భంగా చెన్నకేశవరెడ్డి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని మహిళలు నేడు సమాజంలో ఎదుర్కొంటున్న న్యాయపరమైన సమస్యలపై అవగాహన కలిగించే బాధ్యత మహిళా పోలీసులదే అన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదుల సంఘం సెక్రటరీ బి.వి.రమణారెడ్డి, రామాంజనేయరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

11 నుంచి విఠంరాజుపల్లిలో యాగం

వినుకొండ టౌన్: పెరిగిపోతున్న అనారోగ్య సమస్యల పరిష్కారానికి హిమాలయ గురూజీ ఆధ్వర్యంలో 72 గంటలపాటు అహోరాత్ర మహామృత్యుంజయ యాగం ఈ నెల 11 నుంచి చేయ తలపెట్టినట్లు వినుకొండ శాంతి ఆశ్రమం ట్రస్ట్ సభ్యులు తెలియచేశారు. విఠంరాజుపల్లి గ్రామ శివారులోని సాయి బృందావనంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో హిమాలయ గురూజీ మాట్లాడుతూ యాగం 11న మొదలై 14న పూర్ణాహుతితో ముగుస్తుందన్నారు. సమావేశంలో పెండేల పుల్లారావు, మోహన్‌రావు, సుధాకర్, ప్రవీణు, ఎల్‌ఐసీ వాసు, ఏరువా నాగ ముని కొండారెడ్డి, దొడ్డ శ్రీనివాసరెడ్డి, కందుల లక్ష్మీరెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.

శిక్షణ కార్యక్రమాన్ని సందర్శించిన డీపీవో

రొంపిచర్ల: వ్యర్థాల నుంచి సంపదను సృష్టించటంపై స్థానిక శిక్షణా కేంద్రంలో నిర్వహిస్తున్న క్లాసులను డీపీవో విజయభాస్కరరెడ్డి గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తడిచెత్త, పొడిచెత్త వేరుచేయటం, గ్రీన్ ఎంబాసిడర్ల వాటిని సేకరించటంలో తీసుకోవలసిన పద్ధతులను వివరించారు. వినుకొండ, ఈపూరు, నకరికల్లు, మాచర్ల మండలాలకు చెందిన సర్పంచ్‌లు, సచివాలయాల సిబ్బంది ఈ శిక్షణలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో డీపీఆర్‌సీలు అమరేశ్వరరావు, విశ్వరూపాచారి, ఎండీవో మాధ్యూబాబు, ఈవోపీఆర్డీ విజయరాము, సర్పంచ్ జయమ్మలతో పాటు మండలాల ఎండీవోలు, ఈవోపీర్డీలు పాల్గొన్నారు.

ఆటలమ్మ (చికెన్‌పాక్స్) పై అవగాహన

వినుకొండ(నూజెండ్ల): మండలంలోని ములకలూరు గ్రామంలోని ఎంపీపీఎస్ మెయిన్ స్కూల్ నందు ఆటలమ్మ (చికెన్‌పాక్స్)పై గురువారం ఆయూష్ వైద్యులు డాక్టర్ ఆర్. శ్రీనివాస్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తలనొప్పి జ్వరం, దురద, గులాబీ రంగు బొబ్బల వంటి రాష్ లు ఈ వ్యాధి లక్షణాలన్నారు. ఈ వ్యాధి సోకినయమవడం సర్వసాధారణమన్నారు. ప్రతిఒక్కరూ పరిసరాల పరిశుభ్రతను పాటించాలన్నారు. అనంతరం 45 మంది విద్యార్థులకు వైద్యపరీక్షలు నిర్వహించి ఆయూష్ మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రమేష్, ఉపాధ్యాయులు రవి, యోగా టీచర్ వెంకటాచారి, సిబ్బంది రాజశేఖర్ పాల్గొన్నారు.

టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలోకి...

చిలకలూరిపేట: మండలంలోని యడవల్లి గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు కోనూరి శ్రీనివాసరావు తన అనుచరులతో కలసి పట్టణంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు కొమిరిశెట్టి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. ఆయనకు పార్టీ సీనియర్ నాయకుడు విడదల గోపీనాథ్ పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు.